క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష



మహిళ వివరాలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు రక్షగా మారిందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఎన్‌ఆర్‌టీ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పరిశీలించారు. రోగుల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, స్పెషలిస్టు వైద్యులు, రెవెన్యూ అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

8న కేంద్ర సహాయ మంత్రి కర్నూలు రాక

కర్నూలు కల్చరల్: కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి చౌహాన్ ఈనెల 8న జిల్లాలో పర్యటించనున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ పేర్కొన్నారు. సోమవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీలకంఠ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో కలిసి కేంద్ర సహాయ మంత్రి జిల్లాలో పర్యటించనున్నారన్నారు.నగర శివారులోని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిపూజల్లో పాల్గొంటారన్నారు. అనంతరం అక్కడే కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ డీఎమ్‌ని సందర్శించి అక్కడ చేపడుతున్న భవనాల నిర్మాణ పనులు పరిశీలిస్తారన్నారు.

అరెస్టులను ఖండించండి

కర్నూలు(సెంట్రల్): న్యూస్ క్లిక్ యజమాని ప్రబీర్ పురకాయస్తా, పరిపాలనాధికారి అభిజిత్ చక్రవర్తిల అరెస్టును ప్రజాతంత్ర వాదులు ఖండించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండీ అంజిబాబు, ఎస్.మునెప్ప కోరారు. న్యూస్ క్లిక్ మీడియా ప్రతినిధుల అరెస్టులను నిరసిస్తూ సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలి

కర్నూలు(సెంట్రల్): విశాఖపట్నం ఉక్కు ప్రైవేటీకరణ కార్యాచరణను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఉద్యమం 1,000 రోజులకు చేరుకోవడంతో సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న ఉక్కు పరిశ్రమను నష్టాల పేరుతో ప్రైవేటీకరించడం అన్యాయమన్నారు. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న ఉక్కు పరిశ్రమపై మోదీ కన్ను పడడంతో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.రామాంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.

చలో విజయవాడకు ఆటో కార్మికుల మద్దతు

కర్నూలు(సెంట్రల్) : సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 15న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమానికి ఆటో కార్మికులు మద్దతు ప్రకటించినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు తెలిపారు. సోమవారం సుందరయ్య సర్కిల్‌లో చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆటోలకు పోస్టర్లు అతికించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎంను ప్రత్యామ్నాయంగా గుర్తించాలని ప్రజలను కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: నిరుద్యోగ యువతకు కడపలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ హరి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9000487423 సంప్రదించాలన్నారు.

క్రీడాకారుడికి కలెక్టర్ అభినందనలు



క్రీడాకారుడు వెంకటేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (టౌన్): ఇటీవల గోవాలో జరిగిన పెంటాథ్లాన్ స్విమ్మింగ్ 100 మీటర్ల రిలే మిక్స్‌డ్ విభాగంలో గోనెగండ్ల మండలం గంజిహళ్లి గ్రామానికి చెందిన వెంకటేష్ 3వ స్థానంలో నిలిచారు. ఆయనను సోమవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన సోమవారం తన చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు, జిల్లా సంఘం కార్యదర్శి అవినాష్ పాల్గొన్నారు.

ఆదాయం అదుర్స్

- ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు భారీ ఆదాయం
- ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు గత ఏడాది కంటే రూ.2.19 కోట్లు రాబడి
- లాభాల బాటలో కర్నూలు డివిజన్
- ఆరు యూనిట్లలో ఆశా జనకంగా వ్యాపారం
- శ్రీశైలం రిసార్ట్స్‌కు రూ.2.32 కోట్ల నుంచి రూ.3 కోట్లకు పెరిగిన ఆదాయం



శ్రీశైలం హరిత రిసార్ట్

ఏపీటీడీసీ	2022 ఏప్రిల్-అక్టోబర్	2023 ఏప్రిల్-అక్టోబర్	పెరిగిన ఆదాయం
శ్రీశైలం హరిత రిసార్ట్	రూ.2,32,68,000	రూ.2,99,96,000	రూ.67,28,000
శ్రీశైలం బోటింగ్	రూ.83,89,000	రూ.1,26,07,000	రూ.42,81,000
లేపాక్షి హరిత హోటల్	రూ.33,32,000	రూ.41,48,000	రూ.8,16,000
అహోబిలం హరిత హోటల్	రూ.14,02,000	రూ.22,84,000	రూ.8,82,000

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లాభాల బాటలో పయనిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ఏపీటీడీసీ అధికారుల సమన్వయంతో హరిత హోటల్స్ నిర్వహణ మెరుగుపడింది. దీంతో రాబడి భారీగా పెరిగింది. రిసార్ట్స్, బోటింగ్, హోటల్స్ నిర్వహణలో మార్పులు, కస్టమర్ల అభిరుచులకు తగిన విధంగా వసతులు, ఆహార పదార్థాలను అందుబాటులోకి తేవడంతో వ్యాపారం ఆశాజనకంగా మారింది.

కర్నూలు డివిజన్‌లో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)లో 11 యూనిట్లు ఉన్నాయి. శ్రీశైలం హరిత రిసార్ట్స్, శ్రీశైలం బోటింగ్, శ్రీశైలం రోప్ వే, లేపాక్షి హరిత హోటల్, పెనుగొండ హరిత హోటల్, కర్నూలు హరిత హోటల్, ఓర్వకల్లు రాక్ గార్డెన్స్, మహానంది హరిత రిసార్ట్స్, బెలుం కేవ్స్ హరిత హోటల్, అహోబిలం హరిత హోటల్, గార్గేయపురం రెస్టారెంట్ యూనిట్లు ఉన్నాయి.

పెరుగుతున్న ఆదాయం

- కర్నూలు డివిజన్‌లో ఉన్న ఏపీటీడీసీ 11 యూనిట్లలో 2022 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు జరిగిన వ్యాపారం రూ.9.47 కోట్లు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు రూ.11.66 కోట్ల వ్యాపారం జరిగింది. గత ఏడాది కంటే రూ.2.19 కోట్లు అదనంగా వ్యాపారం జరగడంతో ఏపీటీడీసీకి ఆదాయం భారీగా పెరిగింది.
- శ్రీశైలం హరిత రిసార్ట్‌కు ఈ ఏడాది జనవరిలో రూ.45.84 లక్షలు, మేలో రూ.48.07 లక్షలు, అక్టోబర్‌లో రూ.6.86 లక్షల బిజినెస్ జరిగింది.
- శ్రీశైలం బోటింగ్ యూనిట్‌కు ఈ ఏడాది జనవరి రూ.24.92 లక్షలు, ఫిబ్రవరిలో రూ.25.09 లక్షలు, అక్టోబర్‌లో రూ.28.17 లక్షల బిజినెస్ వచ్చింది.
- లేపాక్షి హరిత హోటల్‌కు గత ఏడాది అక్టోబర్‌లో రూ.6.51 లక్షలు, ఏడాది అక్టోబర్‌లో రూ.6.86 లక్షల వ్యాపారం జరిగింది.
- అహోబిలం హరిత హోటల్‌కు ఈ ఏడాది ఆగస్టులో రూ.4 లక్షలు, అక్టోబర్‌లో రూ.4.46 లక్షల బిజినెస్ జరిగింది.

అందరి సహకారంతో మెరుగైన నిర్వహణ



కర్నూలు డివిజన్‌లోని ఏపీటీడీసీ యూనిట్లలో వ్యాపారం బాగా పెరిగింది.అన్ని యూనిట్ల మేనేజర్ల సహకారంతో హోటల్స్,రెస్టారెంట్లు, బోటింగ్, రోప్‌వేలో నిర్వహణ మెరుగు పడింది. కస్టమర్లకు మంచి వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నాం .దీంతో కస్టమర్ల సంఖ్య పెరుగుతూ వస్తుంది. 11 యూనిట్లలో నాలుగు యూనిట్ల ఆదాయం భారీగా పెరిగింది. కర్నూలు, మహానంది యూనిట్లు ఇంకా మెరుగు పడాల్సి ఉంది. అతి త్వరలోనే అన్ని యూనిట్లు ఆదాయం పెరుగుతుంది.

– చంద్రమౌళీశ్వర రెడ్డి, డివిజినల్ మేనేజర్, ఏపీటీడీసీ కర్నూలు డివిజన్

డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లమా ఇన్ పారామెడికల్ కోర్సుల్లో మిగిలిన ఖాళీలకు ఈ నెల 10 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రూ.100 రుసుము చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు www.appmb.co.in/apsahpc.co.in వెబ్‌సైట్‌లలో లభిస్తాయన్నారు. మిగిలి ఉన్న ఖాళీల వివరాల కోసం www.kurnoolmedicalcollge.ac.inను చూడాలన్నారు.

పీఈటీ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న దేవేంద్ర గౌడ్

కర్నూలు(సెంట్రల్): ప్రైమరీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టులను డీఎస్సీ–2023లో భర్తీ చేయాలని ఏపీ వ్యాయామ విద్యా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్ర డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు శ్రీరాములుగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతి పక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేశారని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. యాత్ర ప్రారంభమై ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక ఎస్‌బీఐ సర్కిల్‌లోని మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ముఖ్యమంత్రి జగనన్న 98 శాతం హామీలను అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ఉద్దేశమని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక 12వ వార్డు పరిధిలోని 28వ సచివాలయం మున్సిపల్ స్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 12వ వార్డు ఇన్‌చార్జ్ నవీన్, వార్డు నాయకులు, డాక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, రైల్వే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కర్నూలు(రాజ్‌విహార్): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం పాతబస్తీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను తీసుకొని, వాటిని పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులకు ఫోన్‌లో సూచించారు.



బాధితుల నుంచి వినతులను స్వీకరిస్తున్న అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్

ఉద్యోగం పేరుతో మోసం

- పోలీసు స్పందనలో బాధితుడి ఫిర్యాదు

కర్నూలు: హైదరాబాదు టెక్ మహీంద్రా మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తామని అమ్మా హాస్పిటల్ వద్ద ఆయేషా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ నిర్వహిస్తున్న మహబూబ్ బాషా 15 మందితో రూ.50 వేల నుంచి రూ.60 వరకు తీసుకుని మోసం చేశాడని సి.క్యాంప్‌కు చెందిన లక్ష్మీనారాయ ణరెడ్డి ఫిర్యాదు చేశారు. సోమవారం ఎస్పీ క్యాంప్ కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ టి.సర్కార్ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 89 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఎకరా పొలానికి పట్టాదారు పాసు పుస్తకం ఇప్పిస్తామని చెప్పి శరీన్‌నగర్‌కు చెందిన శేషఫణి గౌడ్, కేశవులు రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని సల్కాపురానికి చెందిన ప్రసాద్ ఫిర్యాదు చేశారు.
- ఆన్‌లైన్‌లో 13 ప్రీ–పే టాస్కులు చూపించి వాటిని పూర్తి చేస్తే బోనస్ రూపంలో ఇన్వెస్ట్‌మెంట్ చేసిన దానికంటే ఎక్కువగా డబ్బు ఇస్తామని రూ.10 వేలు, రూ.12 వేలు, రూ.3 లక్షలు, రూ.4 లక్షలు.. ఇలా ఇన్వెస్ట్‌మెంట్ చేయిస్తూ ఆశ కలిగించి సైబర్ నేరగాళ్లు మోసం చేశారని గురు రాఘవేంద్ర నగర్‌కు చెందిన రాజేంద్రరావు ఫిర్యాదు చేశారు.
- కర్నూలు పాతబస్టాండ్‌లో ఉన్న సొంత దుకాణాన్ని నాగేంద్రుడు అనే వ్యక్తి బాడుగకు తీసుకుని అతని కుమారుని పేరుతో అక్రమంగా రిజిస్టర్ చేయించి మోసం చేశాడని కర్నూలుకు చెందిన గురునాథ్ ఫిర్యాదు చేశాడు.
- అప్పు తీసుకున్న వ్యక్తికి తిరిగి రూ.3 లక్షలు చెల్లించినప్పటికీ అతని వద్ద ఉన్న చెక్కు, ఇంటి పత్రాలు, ప్రామిసరీ నోట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కర్నూలు బి.తాండ్రపాడుకు చెందిన మహేశ్వరుడు ఫిర్యాదు చేశాడు.

కళాకారులకు దుస్తుల పంపిణీ



మహిళా కళాకారులతో అతిథులు

కర్నూలు కల్చరల్: దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మహిళా కళాకారులకు దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రంగస్థల మహిళా కళాకారులచేత ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. రెండవ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ, దాత డాక్టర్ సుభాన్, విశ్రాంత తహసీల్దార్లు రోషన్ అలీ, అజయ్‌కుమార్, సీనియర్ కళాకారులు పి.దస్తగిరి, హెచ్.చంద్రన్న, సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫివుల్లా, ఉపాధ్యక్షులు హనుమంతరాయ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ఉన్న బాణసంచానే విక్రయించాలి

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): దీపావళి పండుగ రోజున పేల్చేందుకు ఐఎస్ఐ స్టాండర్డ్ ఉన్న బాణసంచాను మాత్రమే విక్రయించేలా చూడాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో బాణాసంచా స్టాళ్ల ఏర్పాటుకు అనుమతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేర చరిత్ర ఉన్న వారికి లైసెన్స్‌లు మంజూరు చేయొద్దన్నారు. ప్రతి స్టాల్ వద్ద 100 లీటర్ల సామర్థ్యం ఉన్న డ్రమ్ములో నీరు, బకెట్లలో ఇసుకను ఉంచుకోవాలన్నారు. దుకాణానికి దుకాణానికి మూడు మీటర్ల మధ్య దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. షాపులను తాత్కాలికంగా రేకుల షెడ్‌తో ఏర్పాటు చేయాలన్నారు. స్టాళ్ల వద్ద అగ్నిమాపక, అంబులెన్స్ వాహనాలు సిద్ధంగా ఉండాలన్నారు. మసీదులు, ఆలయాలు, చర్చిల సమీపాల్లో బాణాసంచా పేల్చకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ స్టాళ్లను ఎల్ ఆకారంలో ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే తప్పించుకోవడానికి వీలు ఉంటుందన్నారు. చిన్న పిల్లలను బాణాసంచా విక్రయ స్టాళ్ల వద్దకు తీసుకురాకూడదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి, సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనమ్మ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఏర్పాటుపై దృష్టి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఏర్పాటుపై పశుసంవర్థక శాఖ దృష్టి సారించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం 429 రెవెన్యూ గ్రామాలకు ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలున్నాయి. మిగిలిన రెవెన్యూ గ్రామాల్లోనూ సంఘాలు ఏర్పాటు చేయనున్నారు. గొర్రెలు, మేకలు జీవనోపాధిగా రాణిస్తున్న వారందరు ఈ సంఘాల్లో సభ్యులుగా ఉండవచ్చు. సంఘంలో సభ్యులుగా కనీసం 11 మంది ఉండాల్సి ఉంది. కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కర్నూలు, నంద్యాల జిల్లాల పశుసంవర్ధకశాఖ అధికారులు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లను ఆదేశించారు. కాగా ఇప్పటి వరకు ఐదుగురు వెటర్నరీ సర్జన్ల నుంచి కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చినట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా గొర్రెలు, మేకల అభివృద్ధి విభాగం ఏడీ డాక్టర్ సుబాన్‌బాషా తెలిపారు.

మోదీ చేతిలో రాష్ట్ర రిమోట్

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ రిమోట్ కంట్రోల్‌తో రాష్ట్రాన్ని పాలిస్తున్నారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వస్తాన్‌వలి విమర్శించారు. సోమవారం రాత్రి డీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం కర్నూలులో నిర్వహిస్తున్న రైతు గర్జన ర్యాలీకి పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌కు మద్దతు

కర్నూలు(అర్బన్): కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8న చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌కు మద్దతు ఇస్తున్నట్లు రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయ ఆవరణలో బంద్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై కేసులు నమోదు

కర్నూలు సిటీ: ఈనెల 5న జరిగిన రెండు ప్రమాదాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. జి.సింగవరం సబ్‌స్టేషన్ సమీపంలోని మలుపు వద్ద, కర్నూలు–సుంకేసుల రోడ్డులో ఆర్.కె దుద్యాల స్టేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాలపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపుతాం

- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



కమిషనర్‌కు వినతిపత్రాలు ఇస్తున్న కాలనీ వాసులు

కర్నూలు (టౌన్): ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యకూ నిర్ణీత గడువు లోపు పరిష్కారం చూపుతామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు విని వినతులు స్వీకరించారు. అనంతరరం వీలైనంత త్వరగా వినతులకు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో నగరపాలక సూపరింటెండెంట్ ఇంజినీర్ వేణుగోపాల్, డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల సమస్యలను పరిష్కరించండి



మంత్రి బుగ్గనను కలిసి వినతిపత్రం అందజేసిన క్రెడాయ్ సభ్యులు

కర్నూలు (టౌన్):టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్) బాండ్ల సమస్యను పరిష్కరించాలని క్రెడాయ్ (కాన్ఫడరేషన్ రియల్ ఎస్టేట్ అండ్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కర్నూలు చాప్టర్ చైర్మన్ సోమిశెట్టి వెంకట్రామయ్య, అధ్యక్షులు సాయిరాం రెడ్డి విన్నవించారు. డోన్‌లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో క్రెడాయ్ ప్రధాన కార్యదర్శి తారకేష్, ఉపాధ్యక్షులు భరత్ రెడ్డి, సురేష్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

భార్య మృతి కేసులో భర్తకు జైలు



ముద్దాయి ముక్తార్ బాషా

కర్నూలు (లీగల్): భార్య మృతికి కారణమైన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జి జి.ప్రతిభాదేవి సోమవారం తీర్పు చెప్పారు. షాజహాన్‌బీ, ముక్తార్ బాషా దంపతులు జొహరాపురంలో నివాసం ఉండేవారు. భర్త అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో 2017 మార్చి 14న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 6 నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

కర్నూలు(సెంట్రల్): డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు డిమాండ్ చేశారు. సోమవారం బుధవారపేటలోని 36, 37 సచివాలయాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌జీ కృష్ణ, విజయమ్మ, ఎం.భాస్కర్, మారెప్ప పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల తనిఖీ

కర్నూలు సిటీ: నగరంలోని ఏక్యాంపు ఇందిరాగాంధీ మున్సిపల్ మెమోరియల్, ప్రభుత్వ బాలికల (కింగ్ మార్కెట్), కల్లూరు, ఓర్వకల్లు, పెద్దపాడు జెడ్పీ హైస్కూల్స్, రవీంద్ర ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్, స్టెమ్ ల్యాబ్‌లను టాస్క్‌ఫోర్స్ టీం సోమవారం తనిఖీ చేసింది. ల్యాబ్‌ల్లో విద్యార్థుల ప్రాజెక్టులను టీం సభ్యులు పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కర్నూలు క్రీడాకారులు

కర్నూలు (టౌన్): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ అండర్ -19 పోటీలకు కర్నూలు విద్యార్థులు మన్విత్, మునీర్, చరణ్‌మౌళి, శివ ప్రసాద్‌లు ఎంపికయ్యారు. ఈనెల 7, 8 తేదీలలో విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పద్మావతి సోమవారం స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: స్థానిక గణేష్ నగర్‌లో నివాసముంటున్న కరగళ్ల ప్రవీణ్ (28) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య లక్ష్మీదేవితో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గౌండా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. మద్యానికి అలవాటు పడి కుటుంబాన్ని పట్టించుకోకుండా భార్యపై అనుమానంతో తరచూ హింసించేవాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణం పొందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.